జయభేరి

శ్రీమతి శ్రీపాద శారదాదేవిగారు

(వెనుకటి సంచిక తరువాయి)

రెండవయంకము—మొదటిరంగము

స్థలము—కల్యాణపట్టణము నందొక రాజభవనమున రాజసభామందిరము.

కాలము—ఉదయము నాలుగుగడియలు ప్రొద్దెక్కినసమయము. ఆరవ దినము.

[పశ్చిమచాళుక్యచక్రవర్తియగు భూలోకమల్లుడు (మూడవసోమేశ్వరుడు) సింహాసనాసీనుడైయుండును. మంథెనగుండరాజు త్రిభువనమల్ల జగద్దేవమహారాజును చెరియొకప్రక్కన ఉచితాసనములపై గూర్చుండి యుందురు. మంత్రియొకడు చక్రవర్తికిసమీపమున నిలబడియుండును.]

భూలోకమల్లుడు:—మంత్రివర్యా! స్వతంత్రుడుగాజూచుచున్న ఆ కాకతిప్రోలరాజు హంతకుని శిక్షించి పశ్చిమచాళుక్యసామ్రాజ్యపీఠమునకు బలియొసగుసమర్థుడు మాసామంతులలో నొక్కడైనలేడా?

మంథెనగుండరాజు:—(లేచి) సామ్రాజ్యాధిపతీ! ఈ మీపాదసేవకుడు దేవరయాజ్ఞయగుట తడవుగా ఆ రాజ్యమదాంధుడగు కాకతిప్రోలుని నొక్కక్షణములో దేవరపాదాక్రాంతునిజేయ నాతురతపడుచున్నవాడు. (అని కూర్చుండును.)

మంత్రి:—జగద్దేవా! చక్రవర్తిగారిమాటలు వింటివిగదా! ఆ ప్రశ్నమునకు తగు సదుత్తరమిమ్ము.

జగద్దేవుడు:—ఇదిగో నా ప్రతిజ్ఞ వినుడు. చతుస్సముద్రవేలాపరివృతమైన పశ్చిమచాళుక్యసామ్రాజ్యచక్రవర్తుల పాదసేవకులమైన మేము ఒక్కప్రోలుని గాదుగదా సమస్త సామంతమండలేశ్వరబృందమును గూడ మన చక్రవర్తియడుగులకు మడుగులొత్తునట్లు చేయగలవారము.

మంథెనగుండరాజు:—మా కాజ్ఞయిండు. నేనును, ఈ జగద్దేవమహారాజును తత్క్షణమేపోయి పశ్చిమచాళుక్యసామ్రాజ్యాంతర్గతంబున కంటకప్రాయుడైన ఆ కాకతిప్రోలుని బంధించి తెచ్చెదము.

భూలోకమల్లుడు:—సామంతమండలేశ్వరులారా! మీ రనుకొనినట్లు కాకతిప్రోలు డంతసులభసాధ్యుడు కాడు.

మంత్రి:—ఏనాడు స్వర్గీయవిక్రమాత్యచక్రవర్తులు దీర్ఘవ్యాధిగ్రస్తులయి మంచముపట్టిరో ఆనాటినుండి కాకతిప్రోలుడు తగుబలమును ధనమును సమకూర్చుకొని స్వాతంత్ర్యపతాకము ననుమకొండదుర్గముపై ధరింపజేయ యత్నించుచున్నట్లు వేగులవాండ్రు తెచ్చువార్తలవలన తెలియుచునేయున్నది.

మంథెనగుండరాజు:—అతనికాబుద్ధి పొడమినట్లు కుమారతైలపదేవుడును, గోవిందదండేశుడును అతనివలన బడిన భంగపాటు చెప్పకయే చెప్పుచున్నది.

భూలోకమల్లుడు:—మీరాజభక్తికి మేమెంతయు సంతసించుచున్నారము. పశ్చిమచాళుక్యసామ్రాజ్యమునకు రానున్నవిపత్తుల నరికట్టుబాధ్యత మీపైగలదు. త్వరగాపొండు. రాజద్రోహుల జెండాడుడు.

గుండరాజు, జగద్దేవరాజు:—చిత్తము దేవా! దేవరయాజ్ఞ శిరసావహించుచున్నాము.

(అని నిష్క్రమింతురు.)

భూలోకమల్లుడు:—మంత్రిసత్తమా! నేటి కీసభ చాలించి అంతఃపురమునకు నేగుచున్నారము, అనుమ

కొండవిషయ మెప్పటికప్పుడు మాకు తెలుపుచుండుము. (అని సింహాసనమునుండి లేచి వెడలిపోవును. మంత్రియు నిష్క్రమించును.)

రెండవ అంకము — రెండవ రంగము

స్థలము - అనుమకొండకోటలోని రాజసభాభవనము

కాలము - ఉదయము నాలుగడియల ప్రొద్దెక్కిన తరువాత తొమ్మిదవదినము.

[ప్రోలరాజు సింహాసనాసీనుఁడై కొలువుదీర్చి యుండును. బేతనమంత్రి చేతనొక లేఖపట్టుకొని వినయముతో నిలుచుండియుండును. కేచర్ల కామచమూపతి మొలకు కరవాలము వ్రేలాడుచుండ మరొక యుచితాసనముపై కూర్చుండియుండును.]

ప్రోలరాజు:— మంత్రివర్యా! మంథెనగుండరాజు వ్రాసిన లేఖయందలి ముఖ్యాంశములు వినిపింపుము.

బేతనమంత్రి:— దేవా చదువుచున్నాఁడ. "ఇదివరలో మీ రొనర్చిన యపరాధములకు క్షమాపణ చెప్పుకొని పశ్చిమచాళుక్య చక్రవర్తియగు సోమేశ్వర సామ్రాజ్యాధిపుని పాదములపైబడవలెను. అట్లు—" (అర్ధోక్తిలో).

ప్రోలరాజు:— ఆ నరాధముడు మదాంధుఁడై తనకును మాకునుగల తారతమ్యము గ్రహింపఁజాలక మిడిసిపడి అట్టి లేఖను వ్రాయ సాహసించుచున్నాఁడుగా?— తరువాత చదువుము.

బేతనమంత్రి:— "అట్లు కానిపక్షమున మేము తక్షణమే మీపై దండెత్తివచ్చి మిమ్ము ప్రాణములతో బట్టుకొనిపోయి ఆపశ్చిమచాళుక్య చక్రవర్తి పాదములకడ జేర్చివైచెదము. (అర్ధోక్తిలో)

ప్రోలరాజు:— ఆ! తెలిసినది. ఆమదాంధుని దుష్ట లేఖయందలి సారాంశము. గర్వోన్మత్తుఁడై వ్రాసిన గుండరాజాధముని లేఖను నింక మాకడ చదివి వినిపింపకుము. (కామచమూపతితో) కామచమూపతీ! కాకతీయరాజన్యుని బాహుబలదర్పము చవిచూడ నవకాశముగల్గించుకొన్న మంథెనగుండదండాధిపునికి ప్రతీకారముచేయ మామనంబు తత్తరపడుచున్నది. నీవును నీ అభిప్రాయము తెలుపవలెనని కుతూహలమై యున్నాము. ఏమనియెదవు?

కామచమూపతి:— దేవా! దేవర బుద్ధిసంపదకు మించి మముబోంట్ల అల్పబోధము అన్యథా యేమి విన్నవించుకొనగలదు?

బేతనమంత్రి:— స్వపరతారతమ్య భేదము గుర్తింపక మత్తిల్లి ప్రవర్తిల్లెడు గుండరాజునకు మున యీ కామచమూపతి దగిన ప్రాయశ్చిత్తవిధిని నిర్ణయింపదగినవాడు.

ప్రోలరాజు:— అందుకు సందేహ మేమి?

కామచమూపతి:— (లేచి) కాకతీయాంధ్రక్షాత్ర తేజమును దిరోభూత మొనరింపఁజూచెడి యీ గుండ భూపాలజలదమును మదీయబాహుబలవజ్రాయుధమున కెరజేయ దేవరయానతికై వేచియున్నాఁడ (అని కూర్చుండును).

బేతనమంత్రి:— కాకతీయ రాజ్యలక్ష్మీ పరిరక్షణ పరాయణచిత్తుఁడగు నీ కామసేనాని గుండరాజాధముని శిరఃఖండన మొనరించి వానిరొమ్మున కాకతి రాజముద్రితాంకమగు వరాహాంకము గుద్ది స్వామి ఋణంబు దీర్చికొన సమర్థుండు.

ప్రోలరాజు:— మంత్రిసత్తమా! లెస్సగావచించితివి. మాకును నట్లే దోచుచున్నది.

కామచమూపతి:— దేవర యనుగ్రహమునకు బాత్రుఁడనైతిని.

మంత్రి:— మహారాజుగారికి దెలియని రాజనీతి యుండదు. అయినను మంథెనగుండభూపుఁడు వ్రాసిన యీ యుత్తరము మిషగాగైకొని కామచమూపతి

అతని రాజధానీనగరంబు ముట్టడించిన మనకు మేలయ్యేడు నని నాయల్పబుద్ధికి దోచుచున్నయది.

ప్రోలరాజు:—ఆ శత్రుకీటకమును సమూలముగా నాశనముజేయ మేము స్వయముగా నతనిపైదండెత్తి వెడల సంకల్పించి యున్నవారము. అయినను నీ విషయమున కామచమూపతి యభిప్రాయంబుకూడ దెలిసికొన దలచినారము.

కామచమూపతి:—మహారాజులుంగారి సేనాధ్యక్షుత్వక్రింద నున్న కాకతీయాంధ్ర సేనార్ణవమును దిలకించుటటుండ కన్నెత్తిచూచుటకైన నే శత్రురాజు సాహసించును? కావున నవశ్యము మహారాజులుంగారు దండునడుపింపదగు సన్నాహంబుగావింప మాకు గర్తవ్యమైయున్నది. (ద్వారపాలకుడు ప్రవేశించును.)

ద్వారపాలకుడు:—యేలినోరికి జయం. శత్రులెవరో మనపట్టణంమీదికి దండెత్తివస్తున్నారని యేలినోరికి విన్నవించుకోడానికి ఒక వీరభటుడు ద్వారందగ్గరకని పెట్టుకొనివున్నాడు. దేవర సెలవైతే- (అందరు ఆశ్చర్యముతో దిలకింతురు.)

ప్రోలరాజు:—ద్వారపాలకా! వేగిరముపోయి అతనిలోనికిం బ్రవేశపెట్టుము. శీఘ్రముగాపొమ్ము.

ద్వారపాలకుడు:—సిత్తము దేవరా! [అని వెడలి మరల నాసైనికుని వెంటబెట్టుకొనివచ్చి] ఇదిగో యేలనవారిక్కడఉన్నారు. ఇటుఇటు (అని వెడలి పోవును).

సైనికుడు:—దేవా! యేలినోరికి జయం. మన పట్టణానికి యేడెనిమిదిమైళ్ళ దూరంలోవున్న మడికొండమీదుగా మహాప్రభో! శత్రురాజొకడు దండెత్తి వస్తూన్నాడని తెలిసికొని దేవరకా వార్త మనవిచేసుకోవడమునకు వస్తి మహారాజా!

ప్రోలరాజు:—కామచమూపతీ! మన సైన్యమును కోటవెలుపల నన్నిమూలల దండువిడిసియుండ నేర్పాటుగావించి శత్రువెవ్వడో తెలిసికొని మాకా వార్త వెంటనే దెలుపుము.

కామచమూపతి:—చిత్తము దేవా! అట్లే గావించెద. (అని నిష్క్రమించును).

ప్రోలరాజు:—మంత్రిసత్తమా! మనకోటలోనుండు సేనానాయకుని నియమితప్రదేశముల దండు నిలిపికొని భద్రముగా కోటద్వారముల గాపాడుచుండుమని తెలియజేయుము.

బేతనమంత్రి:—చిత్తము దేవా! అట్లే యొనర్చెద. (అని నిష్క్రమించును.)

ప్రోలరాజు:—ఎవడురా అక్కడ? అంతఃపురమునకు దారితీయుము. (అని నిష్క్రమించును).

రెండవయంకము—మూడవరంగము.

స్థలము:—హిడింబాశ్రమప్రాంతమున
ఒక మెట్టుగుట్ట.

కాలము:—పగలు రెండుజాముల వేళ,
తొమ్మిదవ దినము.

[అచ్చటిపర్వతముపై పశ్చిమచాళుక్య సామన్తమండలేశ్వరుడగు త్రిభువనమల్ల జగద్దేవమహారాజు ఒక సేనానాయకునకు ఆగుట్టకు దూర్పుభాగమున కాకతీయసైన్యముతో దనసైన్యము దలపడుచున్న విధమును జూపుచుండును.]

జగద్దేవమహారాజు:—(సేనానాయకునితో) మన వీరభటులు ఉదయమునుండియు కాకతీయసైన్యమును అనుమకొండ కోటగోడల సమీపమునకు నెట్టుకొని పోవుచునే యుండిరి. కాని రెడ్డి సేనానాయకు డెవడో కాకతీయసైనికులకు దోడ్పడినాడు. అతడు మనసైన్యమును వెనుకకు మరలింపజేసినందున ఈ హిడింబాశ్రమ పరిసరములు ఉభయసైన్యములకు రణరంగమై యెట్లు ఘోరసంకులసమరము సాగుచున్నదో చూచితివా!

సేనానాయకుఁడు:—చూచుచునే యున్నాఁడ మహారాజా! అదిగో మన గజసైన్యము ముందుకు నెట్టుకొనివచ్చి అశ్వసైనికుల నెట్లు హతమార్చుచు శత్రుసేనానుల జీకాకుపరచుచున్నదో!

జగద్దేవమహారాజు:—ఇదిగో సైనికుఁడొకఁడు పరుగెత్తికొని మనవైపే వచ్చుచున్నాఁడు.

(సైనికుఁడు ప్రవేశించును.)

సైనికుఁడు:—దేవరా! జగద్దేవమహారాజా! కాకతిప్రోలరాజు స్వయంగా సైన్యాన్ని నడిపించుకొంటూ మనల్ని పారదోలాలని కోటనుంచి వెలుపలికి వచ్చి తమసైన్యాన్ని కలిసికొని మనపైకి వస్తూన్నాడని మనదండుదొర మీతో చెప్పిరమ్మన్నాఁడు.

జగద్దేవమహారాజు:—ఏమీ! కాకతిప్రోలరాజే స్వయముగా తనసైన్యమును నడిపించుకొని వచ్చుచున్నాఁడుగా!

సేనానాయకుఁడు:—మనముకూడ మన వీరభటులకుందగినట్లు నుత్సాహపరచుచు ఆకాకతి ప్రోలరాజును ప్రాణములతో బట్టుకొని పశ్చిమ చాళుక్య చక్రవర్తికడ మనము చేసినప్రతిజ్ఞ నెరవేర్చుకొనెదము, త్వరపడుదు!

[అని కొండక్రిందికిబోవును. సేనానాయకుఁడును వెంటబోవును.]

(తెరలో) "వీరభటులారా! పారిపోవుచున్న కాకతీయాంధ్ర సైన్యమధ్యమున మదపుటేనుంగునెక్కి తనసైన్యముతోగూడ ప్రయాణమై అనుమకొండకోట జొరబారనుంకించుచున్న ఆకాకతిప్రోలరాజును బంధింపుడు. అతనిజుట్టుకొనుడు. కొట్టుడు." అను కేకలు సైనికులకోలాహలము వినబడును.

(తెరలేచును.)

(ఒక భయంకరమైన యుద్ధభూమి కానవచ్చును. అచ్చట గుఱ్ఱములయొక్కయు యేనుగులయొక్కయు శవములు మనుష్యులతలలు మొండెములు కనబడును. కాకతిప్రోలరాజు వేషంబుననున్న ఒకని బంధించి ఇద్దరు జగద్దేవమహారాజు సైనికభటులు ప్రవేశింతురు]

ఒకఁడు:—ప్రోలరాజా! విడిపించుకోవాలని యత్నిస్తావా, నిన్నీకత్తికి బలిస్తాను.

రెండవవాఁడు:—ఓరాజా! నీకు ప్రాణాలపై ఆశవుంచుకుంటే జాగ్రత్తగావూరుకుండి జగద్దేవమహారాజులకడకుపట్టుకొనిపోయేటప్పుడు పెనగులాడకుఁడు.

మాయప్రోలరాజు:—ఓ పిరికిపందలారా! యేనుగుమీదనుంచి జారిపడినప్పుడు ఒకసారిగా నన్ను బట్టుకొని కట్టివేయడంకూడా వో పౌరుషమా! విడువండి! విడువండి! లేకపోతే నా రెండుకాళ్లతో మీ ఇద్దర్నీ పొట్టలు చెక్కలయ్యేటట్టు తన్ని పారవేస్తాను. [అని తన్ను విడిపించుకొన పెనగులాడును].

మొదటివాఁడు: —(గట్టిగాపట్టుకొని)అదిగో! మా జగద్దేవమహారాజులు గారిటే వస్తున్నారు తిన్నగా నడు. [జగద్దేవమహారాజు సేనానాయకునితో ప్రవేశించును].

జగద్దేవమహారాజు:—(దూరమునుండి) మనయుద్ధభటులలో నొక్కరైన ఆకాకతిప్రోలరాజును బంధించి తేలేకపోయెనుగా!

సేనానాయకుఁడు:—అదిగో మన వీరభటులిద్దరు ప్రోలరాజునే గాబోలు బంధించి తెచ్చినారు.

ఒకభటుఁడు:—(బంధితుని ముందునకుద్రోచి) జగద్దేవమహారాజా! ఇదిగో కాకతిప్రోలరాజును బంధించి పట్టపేనుగుమీదనుండగా కట్టి తెచ్చేము. యేలినోరి కోరిక చెల్లించాలని మాలో అనేకమంది ఇతని వాడికత్తికి బలైపోయేరు.

జగద్దేవ:—(సిగ్గుచే దలవాల్చుకొనియున్న బంధితుని నిదానించిచూచి సేనానాయకునితో) ఈ బంధితుడు కాకతిప్రోలరాజు కాడేమోయని సంశయము పొడముచున్నది.

సేనానాయకుడు:—నాకును నట్లే దోచుచున్నది.

ఇద్దరు భటులు:—కాదు మహారాజా — కాదు.

ఒకభటుడు:—నీ పేరేమని ఇతన్నడుగుతే 'ప్రోలరాజని నా దుస్తులు చూస్తైనా కనుగొనలేరా?' అన్నాడు. అదీగాక మహాప్రభో! ఒకక్షణంలో అంతమంది ఇతనిచేతిలో సచ్చిపోయినారంటే ఇతడు తప్పకప్రోలరాజయేవుంటాడు.

జగద్దేవమహారాజు:—(తల వంచుకొనియున్నా బంధితుని మొగమెత్తి పట్టుకొనిచూచి) ఓ మూర్ఖశిరోమణులారా! ఇతనినా కాకతిప్రోలరాజని పట్టుకొనివచ్చితిరి. (బంధితునితో) ఓరీ! నీవేనా కాకతిప్రోలరాజవు?

బంధితుడు:—(నిరసనభావముతో) మీవంటి పిరికిపందలకా! కాకతిప్రోలమహారాజులుంగారు దొరికేది! పట్టపేనుంగుమీదినుంచి జారిపడ్డ ఆమహారాజుపైకి ఒక్కసారిగా మీసైనికులంతా వచ్చిపడ్తే, ఆ మహారాజుగారి సైనికులూ మీసైనికులూ దొమ్మిలాడ్తూవుంటే ప్రోలరాజుగారి నెట్లోతప్పించి వారి దుస్తులు వారిమావటివాణ్నయిన నేను తొడుక్కొని కత్తి చేతబుచ్చుకొని కొడుతూవస్తూవుంటే నన్ను పట్టుకొని మీకడకు వచ్చేరు వీళ్లిద్దరూను.

భటులు:—ప్రోలరాజువని పేరుసెప్పిన నీవు ఆయన మావటివాడవా! (అని ఆశ్చర్యపడి చూచుచుందురు.)

జగద్దేవమహారాజు:— సేనానాయకా! ఈయిద్దరి వీరభటులను ఈ బంధితునితోగూడ బంధించి తీసుకొనిపోయి వారినందరిని శిరఃఖండన మొనరింపుము. ఇంతలో అనుమకొండ కోటగోడలనెక్కి లోనికింప్రవేశింపజూచెడి మన వీరసైనికుని నాయంబునకు ప్రోత్సాహపరుప మే మేగెదము. నీవును మమ్ము త్వరగా కలిసికొనుము (అని ముందునకు నడచిపోవును. సేనానాయకుడు డా యిద్దరిభటులను బంధితుని తనవెంట దీసికొనిపోవును.)

(ఇద్దరుభటులు:—రక్షింపుదొరా. మమ్ము రక్షింపు మీ బాంచలము. అని అరచుచున్నను వారిని సేనానాయకుడు నడపించుకొనిపోవును).

డోంగ్రే బాలామృతము

బలహీనమైన బిడ్డలకు పుష్టియున్ను, బలమున్ను, ఆరోగ్యము నిచ్చును. అన్నిస్థలములందు దొరకును.

మద్రాస్ ఏజంటు
ఏ. పి. పరేఖ్
268—చైనాబజారురోడ్డు
మద్రాసు.

ప్రొప్రయిటర్లు:—కె. టి. డోంగ్రే అండ్ కంపెని—బొంబాయి 4